సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 14 । ఆగస్టు । 2024



ఖాళీ చేసి పోండి..!

ఆత్మకూరులోని కొలగాని సత్రం భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేసి పోవాలని దేవదాయశాఖ నోటీసులు జారీ చేసింది.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.72,630
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,558
3 శాతం జీఎస్టీతో	రూ.6,755
నవర (8 గ్రా)	రూ.54,040

గరిష్టం/కనిష్టం
37.1 /29.0

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండి ఉక్కపోతగా ఉంటుంది . గాలిలో తేమ 65 శాతం ఉంది.

న్యూస్‌రీల్

కోవూరు ఏడీజే కోర్టుకు న్యాయమూర్తి నియామకం

నెల్లూరు (లీగల్): కోవూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తిగా కర్నూలుకు చెందిన ఎస్.శివవ్రతను నియమిస్తూ ఏపీ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయమూర్తిగా ఆమెకు తొలి పోస్టింగ్ ఇది. ఈ స్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న న్యాయమూర్తి జే.కాత్యాయినిని కోవూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా బదిలీ చేసింది.

వాయిదా పడిన ఎస్‌ఎంసీ ఎన్నికలు 17న

నెల్లూరు (టౌన్): జిల్లాలోని పాఠశాలల్లో వాయిదా పడిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఈ నెల 17న నిర్వహించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఈ నెల 8న జరిగిన ఎన్నికలు జరిగాయి. అయితే 29 పాఠశాలల్లో వివిధ కారణాలతో ఎన్నికలను వాయిదా వేశారు. ఆయా పాఠశాలల్లో ఎన్నికల కోసం కొత్తగా ఓటర్లు జాబితాను ప్రదర్శించాల్సి ఉంది. 17న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. సాయంత్రం ఎన్నికైన సభ్యులతో సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది.

మైనార్టీల సంక్షేమానికి 15 శాతం నిధులు



మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం అమల్లో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి 15 శాతం నిధులు తప్పనిసరిగా వినియోగించాలని కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. ఈ కార్యక్రమం అమలుపై కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం త్రైమాసిక సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం అమలు చేస్తున్న 25 శాఖల అధికారులు లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రతి పథకంలో 15 శాతం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కేటాయించి ఖర్చు చేయాలన్నారు. ఈ పథకం అమల్లో వెనుకబడిన శాఖల అధికారులు మూడు నెలల్లో జరిగే సమావేశం నాటికి ప్రగతి సాధించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ఏపీడీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, మెప్మా పీడీ రవీంద్ర, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అద్దె దుకాణాల పన్నుల వసూలుకు డ్రైవ్



దుకాణాదారుల నుంచి పన్ను బకాయిలు వసూలు చేస్తున్న రెవెన్యూ అధికారులు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్‌కు చెందిన వాణిజ్య దుకాణాల పన్ను బకాయిల వసూలును వేగవంతం చేస్తున్నామని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తెలిపారు. స్థానిక కేఏసీ కాంప్లెక్స్, పప్పులవీధి కాంప్లెక్స్, జేవీఆర్ కాంప్లెక్స్, ఎన్‌సీబీ కాంప్లెక్స్, సుబేదారుపేట కాంప్లెక్స్, ఏసీ సుబ్బారెడ్డి తదితర కాంప్లెక్స్‌ల్లోని మున్సిపల్ అద్దె షాపుల పన్నుల బకాయిల వసూలుకు కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు మొండి బకాయిలున్న 10 షాపులను సీజ్ చేశారు. వివిధ పన్నులకు సంబంధించిన బకాయిదారుల నుంచి ఆస్తి పన్ను, కుళాయి పన్ను, డ్రైనేజీ పన్నులకు సంబంధించి రూ.69,74,129 నగదు, చెక్కులు, ఆన్‌లైన్ పేమెంట్ విధానాల్లో వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సమ్మద్, శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కృష్ణకిషోర్, సునీల్, కృష్ణంరాజు, చినబాబు, రవి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులపై విజిలెన్స్ దాడులు

- ఆటోలో 20 బస్తాలు, మిల్లులో 11 టన్నుల రేషన్ బియ్యం సీజ్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పేదల బియ్యం పక్కదారి పడుతున్న విషయం మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలో వెలుగుచూసింది. విజిలెన్స్ సీఐ పెంచలరెడ్డి కథనం మేరకు.. మండలంలోని నాగమాంబపురంలోని ఓ రైస్‌మిల్లుకు రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేశామని తెలిపారు. మిల్లు లోపలికి వెళ్తున్న ఆటోను పట్టుకుని పరిశీలించగా అందులో 20 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. మిల్లు లోపలికి వెళ్లి చూడగా 11 టన్నుల రేషన్ బియ్యం గుట్టగా పోసి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పేదలకు ముక్కిన బియ్యమే

- రెండు నెలల్లోనే ఎంత మార్పు! పేదలంటే ఇంత చిన్న చూపా.. బాబూ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ షాపుల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా
- ప్రభుత్వం మారగానే నాసిరకం బియ్యం పంపిణీ
- పేదలకే కాదు.. స్కూళ్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకూ అవే రకం
- స్కూళ్లలో మధ్యాహ్నం భోజనం తినే విద్యార్థుల సంఖ్య తగ్గిన వైనం
- న్యాయమూర్తికి మొరపెట్టుకున్న కందుకూరులోని కేజీబీవీ విద్యార్థులు
- మిల్లర్లతో కుమ్మక్కై ముక్కిన బియ్యాన్ని దిగుమతి చేసుకుంటున్న అధికారులు

పేదలంటే కూటమి ప్రభుత్వానికి ఎంత చిన్న చూపో రెండు నెలల్లోనే బోధపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మారగానే రేషన్ షాపుల ద్వారా అందజేసే బియ్యంలో నాణ్యత కొరవడింది. ఈ నెలలో పంపిణీ చేసిన బియ్యం పరిశీలిస్తే.. ముక్కిపోయి, ఉండలు కట్టి అత్యంత నాసిరకంగా ఉన్నాయి. పేదలకే కాదు.. స్కూళ్లకు, హాస్టళ్లకూ ఇలాంటి బియ్యాన్ని పంపిణీ చేయడంతో తినలేక విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుని తింటున్నారు. కందుకూరులోని కేజీబీవీని సందర్శించిన అక్కడి కోర్టు న్యాయమూర్తికి 'భోజనం తినలేక పోతున్నాం సార్' అంటూ విద్యార్థులు మొరపెట్టుకున్నారంటే ఈ ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో నాణ్యత ఎంత ఉందో అర్థమవుతోంది. గత ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేదలకే కాకుండా స్కూళ్లు, హాస్టళ్లు, కస్తూర్బాలకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేసింది.



పొనుగోడు రేషన్ షాపునకు సరఫరా అయిన నాసిరకం బియ్యం

నెల్లూరు (దర్గామిట్ట): రేషన్ బియ్యం అంటేనే దశాబ్దాలుగా జుగుప్సాకరమైన భావన. రైస్ మిల్లర్ల దగ్గర అత్యంత ఖరీదుకు కొనుగోలు చేసి రూపాయికే అందించినా నాణ్యత లేకపోవడంతో కటిక పేదలు కూడా ఆ బియ్యం తినలేక వ్యాపారులకు అమ్ముకునే పరిస్థితి. ఇలా ఈ బియ్యమే రేషన్ షాపులకు రీసైక్లింగ్ అవుతున్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితికి చెక్ పెడుతూ రేషన్ షాపుల ద్వారా నాణ్యమైన బియ్యం పంపిణీకి శ్రీకారం జరిగింది. బియ్యం నాణ్యతలో రాజీ పడకుండా.. మరిన్ని పోషక విలువలు జోడించి 'ఫోర్టిఫైడ్ బియ్యం'గా సరఫరా చేసింది. రేషన్ బియ్యమని చిన్నచూపు చూసిన వారు సైతం లొట్టలేసుకుని తిన్న పరిస్థితికి తీసుకువచ్చారు. రేషన్ షాపుల ద్వారా సరఫరా చేసిన బియ్యం పక్కదారి పట్టి రీసైక్లింగ్ అయ్యే అవకాశాలు తగ్గిపోయాయి. ప్రభుత్వం మారగానే మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది.

మిల్లర్లతో కుమ్మక్కై..

ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా బియ్యం అందజేస్తోంది. ఉచితంగా ఇచ్చే బియ్యమే కదా ఎలాంటివి ఇచ్చినా తీసుకుంటారనే లెక్క లేనితనం కొత్త ప్రభుత్వంలో కనిపిస్తోంది. పేదలకు అందాల్సిన నాణ్యమైన బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా సరఫరా చేయాల్సి ఉండగా మిల్లర్లతో కుమ్మక్కై వారి దగ్గర గోదాముల్లో నిల్వ ఉండి ముక్కిపోయిన బియ్యాన్ని తీసుకుని సరఫరా చేస్తోంది. నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన టెక్నికల్ సహాయ మేనేజర్ కూడా మిల్లర్ల



చిరువెళ్లలో రంగుమారిన బియ్యం



నాసిరకం.. పురుగులు పట్టిన బియ్యం సరఫరా

- జిల్లాలో ఎఫ్‌సీఐ గోదాములకు

పొరుగు జిల్లాల మిల్లర్ల ద్వారా గూడ్స్ వ్యాగన్లతో బియ్యం దిగుమతి అవుతాయి. అయితే దిగుమతి చేసుకునే బియ్యాన్ని అక్కడి మిల్లర్లతో మిలాఖత్ అయి కొంత శాతం అత్యంత నాసిరకమైన బియ్యాన్ని దిగుమతి చేసుకున్నారు. జిల్లాలోని 1,513 రేషన్ షాపులకు 11 ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా బియ్యం రవాణా చేయాల్సి ఉంది. ఎంఎల్ఎస్ పాయింట్లకు దిగుమతి అయిన బియ్యం నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు పరిశీలించకుండానే రేషన్ దుకాణాలకు సరఫరా చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాముల్లో ఉండే అధికారులతో ఎంఎల్ఎస్ పాయింట్లలో ఉండే అధికారులతో మిల్లర్లు కుమ్మక్కై ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయాల్సిన బియ్యం స్థానంలో నాసిరకమైన, ముక్కిపోయిన, పురుగులు పట్టిన బియ్యం సరఫరా చేసినట్లు తెలిసింది. ఆయా ప్రాంతాల్లో రేషన్ షాపు డీలర్లు ఇష్టపడకపోవడంతో ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఉండే డిప్యూటీ తహసీల్దార్లు ఒత్తిడితో దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉచితంగా ఇచ్చేవి కదా అనే నిర్లక్ష్య ధోరణితో సర్దుబాటు చేసినట్లుగా సమాచారం. ఆత్మకూరు ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో అనంతసాగరం, చిరువెళ్లతో పాటు ఏఎస్‌పేట మండలం పొనుగోడు, గుడిపాడు, హసనాపురం తదితర ప్రాంతాల్లో నాసిరకం బియ్యం దిగుమతి అయ్యాయి. కొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు అధికారులకు చెప్పుకోలేక నాసిరకం బియ్యాన్నే తీసుకున్నట్లు తెలుస్తోంది.

వద్ద ముడుపులు తీసుకుని పనికి రాని ముక్కిపోయిన బియ్యం సరఫరాకు అనుమతి ఇస్తున్నారు.

గతంలో ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ షాపుల పేదలు, పేద బిడ్డలు చదువుకునే స్కూళ్ల హాస్టళ్లు, కస్తూర్బాలు, గురుకులాలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. తినే అన్నం ద్వారా పోషక విలువలు పెంచాలనే ఆలోచనతో మరింత ఖర్చు పెట్టి సాధారణ బియ్యానికి పోషక విలువలు జోడించి ఫోర్టిఫైడ్ బియ్యంగా సరఫరా చేశారు. బియ్యం నాణ్యత పెరగడంతో స్కూళ్లలో మధ్యాహ్న భోజనం చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కొందరు ఉపాధ్యాయులు కూడా ఇదే అన్నం తినేందుకు కూడా వెనుకాడలేదంటే అప్పటి బియ్యం నాణ్యత ఎంతో అర్థమవుతోంది.

జిల్లాలో రేషన్ షాపులు : **1,513**

జిల్లాలో రేషన్ కార్డులు : **7,33,520**

ఈ నెల సరఫరా అయిన బియ్యం : **11,128.880** మెట్రిక్ టన్నులు

ప్రభుత్వ పాఠశాలలకూ అవే బియ్యం



నెల్లూరులోని ఓ పాఠశాలలో ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

రేషన్ షాపుల ద్వారానే ప్రభుత్వ రంగ పాఠశాలలకు మధ్యాహ్నం భోజన పథకానికి సరఫరా చేయాల్సి ఉంది. మిడ్ డే మీల్స్ పథకానికే కాకుండా అంగన్‌వాడీలు, కస్తూర్బాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు, ఇతర గురుకుల పాఠశాలలకు అవే బియ్యాన్ని సరఫరా చేశారు. గడిచిన నెలన్నరగా బియ్యం నాణ్యత లేక.. అన్నం బాగుండకపోవడంతో తినకలేక విద్యార్థులు ఇంటి వద్ద నుంచి క్యారియర్లు తెచ్చుకుని తింటున్నారు. సోమవారం కందుకూరులోని కేజీబీవీని పరిశీలించిన అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి నిఖిల్‌రెడ్డికి అన్నం తినలేకపోతున్నామని మొరపెట్టుకున్నారు. దీన్ని బట్టి చూస్తే పేదలు, పేద బిడ్డలు చదువుకునే పాఠశాలలకు ఎంతటి నాణ్యమైన బియ్యాన్ని ఈ ప్రభుత్వం సరఫరా చేస్తోందో అర్థమవుతోంది. పేదలంటే ఈ ప్రభుత్వానికి మొదటి నుంచి చిన్నచూపే.

నాసిరకం బియ్యం సరఫరా నిజమే

నాసిరకమైన బియ్యం కొన్ని రేషన్ షాపులకు దిగుమతి అయిన విషయం వాస్తవమే. ఎఫ్‌సీఐ గోడౌన్లకు వ్యాగన్ల ద్వారా సరఫరా అవుతోంది. క్వాలిటీ పరిశీలన చేసిన తర్వాతే దిగుమతి చేస్తాం. నాణ్యత ప్రమాణాలు పాటించాకే ఎంఎల్ఎస్ పాయింట్లకు ఎగుమతి చేస్తున్నాం. ఇక నుంచి క్వాలిటీపై ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడుతాం. – **లక్ష్మీనరసింహారావు, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ**

పంద్రాగస్టు సంబరాలకు ఏర్పాట్లు



స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబవుతున్న వేదిక

నెల్లూరు (దర్గామిట్ట): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే సంబరాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం కలెక్టర్ ఒ. ఆనంద్ మాట్లాడుతూ నెల్లూరు పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఎగురవేసి వందన స్వీకరణ చేస్తారని తెలిపారు. అనంతరం మంత్రి సందేశం, ప్రజాప్రతినిధులు, సమరయోధులు, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖుల పరిచయ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రచార శకటాల ప్రదర్శన, 10 గంటలకు విద్యార్థిని, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, 11 గంటలకు విశిష్ట సేవలందించిన అధికారులు, ఉద్యోగులు, సేవా సంస్థలకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తారన్నారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తారన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ జరిగే పతాకావిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులు హాజరుకావాలని కలెక్టర్ కోరారు. ఉదయం 7.30 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే పతికావిష్కరణకు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని కార్యాలయ అధికారులు, సిబ్బంది హాజరుకావాలని తెలిపారు.



విద్యార్థి ఆత్మహత్యపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నారాయణ వైద్య కళాశాలలో డెంటల్ విద్యార్థి ప్రదీప్ ఆత్మహత్య ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణ జరిపించాలని 'ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మంగళవారం డిమాండ్ చేసింది. తోటి విద్యార్థులే తన సోదరుడి ఆత్మహత్యకు కారణమని, మానసికంగా శారీరకంగా లైంగికంగా వేధించారని మృతుడి సోదరుడు అఖిల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన తర్వాత అర్ధగంట వరకు కూడా అంబులెన్స్ రాలేదని, తన సోదరుడి ఆత్మహత్య సమాచారం ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం గోప్యంగా ఉంచిందని ఆరోపణలు చేశాడు. ఈ నేపథ్యంలో జ్యుడీషియల్ విచారణ చేసి వాస్తవాలు నిగ్గు తేల్చాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేస్తోంది. కళాశాల హాస్టల్స్‌లో ఉండే విద్యార్థుల బాగోగులు, మానసిక పరిస్థితులు తెలుసుకోవాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొంది. కళాశాలలో చాపకిందనీరులా ఉన్న ర్యాగింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన కళాశాల కమిటీలు, యాజమాన్యం సిబ్బంది నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొందని విచారం వ్యక్తం చేసింది. పది మందికి ప్రాణం పోసే వృత్తిని అభ్యసిస్తున్న విద్యార్థులు ఇంత క్రూరత్వంగా వ్యవహరించడం, వీరు చదివే విద్యకు మాయని మచ్చగా మారుతుందని పేర్కొంది. రాష్ట్రంలో ర్యాగింగ్‌ను అంతం చేసేందుకు కఠినన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

20 టీఎంసీలకు చేరువలో సోమశిల

- 13 రోజుల్లో 10 టీఎంసీలు రాక
- మంగళవారం ఒక్కసారిగా తగ్గిన ఇన్‌ఫ్లో

జలాశయానికి వచ్చిన ఇన్‌ఫ్లో

తేదీ	క్యూసెక్కులు
01	2,754
02	5,926
03	6,296
04	7,307
05	7,291
06	7,145
07	8,023
08	10,129
09	11,044
10	12,432
11	12,520
12	14,918
13	10,117

సోమశిల: సోమశిల జలాశయం కృష్ణా జలాల రాకతో 20 టీఎంసీలకు చేరువ అవుతోంది. ఈ నెల 1వ తేదీ నుంచి జలాశయానికి కృష్ణా జలాల రాక ప్రారంభమైంది. అప్పటి వరకు జలాశయంలో 9.471 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 13 రోజుల వ్యవధిలో దాదాపు 10 టీఎంసీలు పెరగడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే మొదటి పంట సాగుకు ఢోకా ఉండదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే సోమవారం 14,918 క్యూసెక్కులు ఉన్న వరద ప్రవాహం మంగళవారానికి 10,117 క్యూసెక్కులకు తగ్గిపోయింది. అయినప్పటికి జలాశయానికి కొంత మేర వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయని జలాశయం అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 19.49 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తెలుగు గంగ కాలువ ద్వారా చెన్నై మహానగరానికి తాగు నీటి అవసరాల కోసం 5 టీఎంసీలు విడుదల చేయనున్నారు. సోమశిల– కండలేరు కాలువ ద్వారా నీటి విడుదలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. చెన్నైకు నీటి కేటాయింపులు పోను కండలేరు కింద ఆయకట్టు సాగునీటికి కొంత మేర విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 88.115 మీటర్ల మట్టం నమోదైంది.



సోమశిల జలాశయం

బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు

- బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్

మర్రిపాడు: మూడేళ్లుగా ఉన్న ధరలు చూసి అధికంగా పొగాకును పండించొద్దని, బోర్డు అనుమతించిన మేరకే పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్, వైస్ చైర్మన్ జీ వాసుబాబు రైతులకు సూచించారు. మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని మంగళవారం వారు సందర్శించారు. కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ 2024 పంట కాలానికి ఆంధ్రప్రదేశ్ బోర్డు 142 మిలియన్ కిలోలు పండించేందుకు అనుమతినిచ్చిందనారు. రైతులు దాదాపు 200 మిలియన్ కిలోలకు పైగా పండించారన్నారు. అంతకు మించి పండించిన పంటను కూడా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అమ్ముకునేందుకు బోర్డు సమ్మతిచ్చిందన్నారు. 2024–25 పంట కాలానికి ఆంధ్రప్రదేశ్‌లో 167 మిలియన్ కిలోల పొగాకు పండించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. తేలికపాటి నేలల్లో ఒక బ్యారన్‌కు 4,725 కిలోలు పొగాకు పండించేందుకు అనుమతి ఉందన్నారు. బ్యారన్ రిజిస్ట్రేషన్లు ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతాయన్నారు. ప్రపంచంలో ప్రతి దేశంలో పొగాకు అధికంగా పండించడం వల్ల వచ్చే పంట కాలానికి పొగాకు డిమాండ్ ఎంత వరకు ఉంటుందో చెప్పలేమన్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతుల ద్వారా నాణ్యమైన పొగాకును మాత్రమే పండించాలని తెలిపారు. రాబోయే పంట కాలానికి ఉత్పత్తి నియంత్రణ అవసరం ఉండాలన్నారు. బ్యారన్‌లు, పొలాలు కౌలుకు అధిక ధరలకు తీసుకోవడం వల్ల తీవ్రంగా నష్టపోతారన్నారు. పొగాకు బోర్డు పొగాకు రైతుల సంక్షేమానికి కావాల్సిన అన్ని చర్యలను తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్, రైతు సంఘం నాయకులు జీ నరసపనాయుడు, ఏ జనార్దన్‌నాయుడు, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

టీడీపీ నేతల అత్యుత్సాహంపై సోమిరెడ్డి ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నేతల అత్యుత్సాహంపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన వెంకటాచలం మండలం ఈదగాలిలో మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే సోమిరెడ్డి మండలంలోని ఇడిమేపల్లి, ఈదగాలి పంచాయతీలో పర్యటించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారని టీడీపీ నేతలు సోమిరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సంబంధిత పనుల పరిశీలనకు మీడియాను వెంటబెట్టుకుని వచ్చారు. అయితే అక్కడ జరిగిన పనులన్నీ సక్రమంగానే కనిపించడంతో సోమిరెడ్డి అవాక్కయ్యారు. ఏదో జరిగిపోయిందని చెప్పాలని వచ్చి.. మీడియాకు చూపించలేక అసహనానికి గురయ్యారు. దీంతో టీడీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో చేసిన పనులు చూపిస్తే ఎలా? ఇటీవల చేసిన పనులకు సంబంధించి చేయకుండానే బిల్లులు చేసుకున్న వాటిని కదా చూపించాల్సిందంటూ రుసరుసలాడారు. అన్నీ విషయాలు తెలుసుకుని కదా తనకు చెప్పాల్సిందంటూ టీడీపీ నాయకులపై సోమిరెడ్డి అక్కడే ఉన్న రైతులు, అధికారులు సమక్షంలో మండిపడ్డారు. వచ్చాం కదాని నాలుగు విమర్శలు చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



టీడీపీ నేతలతో కలిసి ఈదగాలిలో పర్యటించిన సోమిరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం రేపు

నెల్లూరు (బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ భవనంలో గురువారం ఉదయం 8.30 గంటలకు 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు, అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జరగనుందని ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎంగౌస్, ఎస్వీవీఎస్ మూర్తి మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం వస్తారన్నారు.

ఖాళీ చేసి పోండి..!

- నోటీసులు జారీ చేస్తున్న దేవదాయ శాఖ
- కొలగాని రామయ్య సత్రం వాసుల ఆందోళన
- ఏడు దశాబ్దాలకుపైగా ఇక్కడే నివాసం


గోడు వెళ్లబోసుకుంటున్న మహిళలు

ఆత్మకూరు: పట్టణంలోని కొలగాని రామయ్య సత్రం వద్ద ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారిని అక్కడి నుంచి ఖాళీ చేయాలంటూ నోటీసులను జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఏమి చేయాలో పాలుపోక పలువురు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి పలు కుటుంబాలకు చెందిన మూడో తరం వారు ఇక్కడ నివసిస్తున్నారు. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే పేదలు నివసిస్తున్న ఈ ప్రాంతాన్ని కొలగాని రామయ్య సత్రం పేరుతో దేవదాయ శాఖకు స్వాధీనం చేశారని సమాచారం. దీంతో అక్కడ నిర్మించిన ఇళ్లు, రోడ్డువైపు ఉన్న దుకాణాలను ఖాళీ చేసి వారంలో వెళ్లిపోవాలంటూ పలువురికి దేవాదాయ శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామాలతో ఎక్కడికెళ్లాలని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

1899లో డీఎస్‌ఓ నంబర్ డాక్యుమెంట్ 202 / 1899 కొలగాని రామయ్య సత్రం పేరుతో ఉంది. అప్పట్లో లక్కరాజుపల్లికి చెందిన పిచ్చినాయుడు, కరటంపాడుకు చెందిన పాపానాయుడు, మహమ్మదాపురానికి చెందిన వీరరాఘవరెడ్డి, గొల్లపల్లికి చెందిన కొండప్పనాయుడు, కుల్లూరుకు చెందిన సోమిశెట్టి, ఆత్మకూరుకు చెందిన మొదీన్ సాహెబ్, వీరరాఘవులుతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. కొలగాని రామయ్య కుమారుడు లక్ష్మీనరసయ్య మైనర్ కావడంతో ఆయన్ను సంరక్షిస్తూ వీరు సత్ర నిర్వహణ చూడాలని డాక్యుమెంట్‌లో పొందుపర్చారు. లక్ష్మీనరసయ్య మినహా మిగిలిన వారెవరూ కొలగాని రామయ్య కుటుంబసభ్యులు కారు. తదనంతరం రెవెన్యూ పాలనలో జరిగిన మార్పుల కారణంగా 1908 నాటికి కొలగాని రామయ్య సత్రం సర్వే నంబర్‌ను 985ను 1965 / ఏగా మార్పు చేశారు. 1899 నాటికి ముందే సత్రంలో ఐదంకణాల పెంకుటిల్లు, కోనేరు, రెండు పూరి కొట్టాలను ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో 2.65 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమిలో ట్రస్ట్ సభ్యులకు ఎలాంటి హక్కుల్లేవు. సత్రం, కోనేరుకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏదైనా గ్రామం ఏర్పడితే దానికి కొలగాని రామయ్య పేరు పెట్టాలని డాక్యుమెంట్‌లో పొందుపర్చారు. అదే విధంగా స్థలాలపై తమ కుటుంబ సభ్యులకు ఎలాంటి హక్కులను పొందుపర్చలేదు. అయితే ప్రస్తుతం పలువురు కొలగాని కుటుంబీకులు ఇది తమదని చెప్పుకోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఒత్తిడి ఫలితమేనా..?

1994లో అప్పటి ఎమ్మెల్యేపై కొందరు ఒత్తిడి తీసుకొచ్చారని సమాచారం. దీంతో సదరు భూమిని దేవాదాయ శాఖకు అప్పగించేందుకు తీర్మానం పెట్టారని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇది దేవదాయ శాఖ భూమిగా మారిపోయింది.

దేవదాయ శాఖకు అప్పగిస్తున్నట్లు నోట్

ఈ స్థలాన్ని దేవదాయ శాఖకు అప్పట్లోనే అప్పగిస్తున్నట్లు నోట్‌లో పొందుపర్చారు. మరోవైపు దాదాపు వంద కుటుంబాలకుపైగా పేదలు దశాబ్దాలుగా ఇక్కడ పూరిళ్లు, రేకుల ఇళ్లను నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. అర్ధాంతరంగా ఖాళీ చేయించేందుకు యత్నిస్తుండటంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రకటన.. ఆపై నోటీసులు

తమ శాఖకు చెందిన స్థలాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని, పేదలకు ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ క్రమంలో కొందరు దుకాణదారులు, నివాసం ఉంటున్న వారికి వారం రోజుల్లో ఖాళీ చేయాలంటూ దేవదాయ శాఖ పేరుతో నోటీసులు అందాయి. కాగా ఈ విషయమై ఈఓ ప్రసాద్‌రెడ్డిని సంప్రదించగా, కొలగాని రామయ్య సత్రం స్థలంలో ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, ఇళ్లకు నోటీసులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందజేశామన్నారు. చట్టప్రకారం సదరు స్థలంపై దేవదాయ శాఖకు పూర్తి హక్కులున్నాయని, ప్రత్యామ్నాయం చూపాకే స్థలాలను ఖాళీ చేయిస్తామని బదులిచ్చారు.

70 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం



పూరిగుడిసె వేసుకొని 70 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నాం. చిరు వ్యాపారం చేస్తూ పిల్లలను పెంచి పెద్ద చేశా. ఇప్పుడు శక్తి లేక ఇంటి వద్దే ఉంటున్నా. మాకెక్కడా స్థలం లేదు. ఇప్పుడు ఖాళీ చేసి వెళ్లాలంటే ఎలా..?

– రంగమ్మ, బాధితురాలు, ఆత్మకూరు

ఈ వయస్సులో ఎక్కడికెళ్లాలి



పెద్దల కాలం నుంచే ఇక్కడ నివసిస్తున్నాం. ఈ ప్రాంతాన్ని ఎన్నో పేర్లతో పిలిచినా, మమ్మల్ని ఖాళీ చేయమని చెప్పలేదు. ఇప్పుడు ఖాళీ చేయాలంటున్నారు. ఈ వయస్సులో ఎక్కడికని వెళ్లాలి. ప్రభుత్వ పెద్దలు ఆదుకోవాలి.

– బీబీజాన్, బాధితురాలు, ఆత్మకూరు

నేరాలను కట్టడి చేసేందుకు..


జనార్దన్‌రెడ్డి కాలనీలో అవగాహన కల్పిస్తున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

- జిల్లాలో పెరిగిన దొంగతనాలు
- చోరీలు, హత్యల నేపథ్యంలో స్పందించిన పోలీస్ బాస్
- అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో నేరాలు పెరిగాయి. గడిచిన నెలరోజులుగా దొంగలు తాళాలు వేసిన ఇళ్లు, దుకాణాలు, ఆలయాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు, హత్యల నేపథ్యంలో ప్రజలకు కంటి మీద కునుకు కరువవుతోంది. ఈ నేపథ్యంలో నేరాల నియంత్రణపై ఎస్పీ కృష్ణకాంత్ దృష్టి సారించారు. గస్తీని ముమ్మరం చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. దీంతో నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో గస్తీని సీసీఎస్, స్థానిక పోలీస్ అధికారులు ముమ్మరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తులు, సస్పెక్ట్‌లు, జైలు నుంచి విడుదలవుతున్న వారి కదలికలపై నిఘా పెంచారు. వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. రాత్రివేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి పూర్తి వివరాలతో పాటు ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించి తమవద్దనున్న డేటాబేస్‌తో పోల్చి చూస్తున్నారు. నేరచరిత్ర లేని వారి ఫోన్ నంబర్లు తీసుకొని వదిలేస్తున్నారు. మరోవైపు ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్లు, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలు, పార్కుల వద్ద అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఊళ్లకెళ్లే సమయంలో ఇళ్లలో విలువైన వస్తువులను ఉంచరాదని సూచిస్తున్నారు. వీలైనంత మేరకు ఎవరో ఒకరు ఇంట్లో ఉండేలా చూడాలన్నారు. ఎల్‌హెచ్‌ఎమ్మెస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్, అధికారుల ఫోన్ నంబర్లను అందజేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై డయల్ 112 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందిస్తే తగు చర్యలు చేపడతామని వెల్లడిస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	105
లేయర్ (లైవ్)	95
బ్రాయిలర్ చికెన్	200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	220
లేయర్ చికెన్	161

కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యం

కొండాపురం: మండలంలోని రేణమాలలో గల పొలాల్లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం మంగళవారం లభ్యమైంది. కొండాపురం ఎస్సై మహేంద్ర వివరాల మేరకు.. దాదాపు 20 రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని పశువుల కాపర్లు తెలిపారన్నారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపామని చెప్పారు. మృతదేహాన్ని చుట్టుపక్కల గ్రామస్తులెవరూ గుర్తించలేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.100
సన్నవి	రూ.50
పండ్లు	రూ.40

భైరవకోనలో కనువిందు..



సీతారామపురం: భైరవకోనలో జలపాతం కనువిందు చేస్తోంది. ప్రకృతి ఒడిలో సేదదీరుతూ.. ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించాలని కోరుకునే వారిని ఆహ్వానిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తూ దివి నుంచి భువికి జాలువారుతూ పర్యాటకులను మైమరపిస్తోంది.

రెవెన్యూ సదస్సులకు ప్రత్యేకాధికారుల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో త్వరలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులకు మండలానికో ప్రత్యేకాధికారిని నియమిస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా సదస్సులను నిర్వహించనున్నామని చెప్పారు. గ్రామాల్లో సదస్సుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు విజయవంతం చేయాలని ఆదేశించారు. నివేదికలను కలెక్టరేట్, సీసీఎల్ఏకు రోజూ పంపాలని సూచించారు.

అధికారులు వీరే..

ఏఎస్‌పేటకు అశోక్‌కుమార్, అల్లూరుకు మృదుల, అనంతసాగరానికి దేవసేనమ్మ, ఆత్మకూరుకు కన్నమనాయుడు, బోగోలుకు సుధాకర్, బుచ్చిరెడ్డిపాళేనికి రవీంద్ర, చేజర్లకు సాంబశివారెడ్డి, దగదర్తికి సుస్మిత, దుత్తలూరుకు రామారావు, ఇందుకూరుపేటకు శ్రీనివాసులు, జలదంకికి శ్రీనివాసులు, కలిగిరికి నాగేశ్వరరావు, కలువాయికి అనితకుమారి, కావలికి రమేష్ నాయక్, కొడవలూరుకు సత్యవాణి, కొండాపురానికి సుబ్రహ్మణ్యం, కోవూరుకు బాపిరెడ్డి, మనుబోలుకు సుబ్బారెడ్డి, మర్రిపాడుకు రాజారమేష్ ప్రేమ్‌కుమార్, ముత్తుకూరుకు సోమయ్య, నెల్లూరు రూరల్‌కు దయాకర్, పొదలకూరుకు శోభన్‌బాబు, రాపూరుకు తిరుపతయ్య, సీతారామపురానికి గంగాధర్, సంగానికి కోటేశ్వరరావు, సైదాపురానికి పద్మాదేవి, తోటపల్లిగూడూరుకు చిన్న ఓబులేసు, ఉదయగిరికి పద్మావతి, వరికుంటపాడుకు పద్మజ, వెంకటాచలానికి ఉషారాణి, విడవలూరుకు గౌతమ్, వింజమూరుకు నిర్మలాదేవి, గుడ్లూరుకు సూర్యచంద్రారెడ్డి, కందుకూరుకు శేషగిరిరావు, లింగసముద్రానికి శ్రీనివాసరెడ్డి, ఉలవపాడుకు వెంకటేశ్వరరావు, వలేటివారిపాళేనికి శ్రీనివాసరావు, నెల్లూరు అర్బన్‌కు శర్మదను నియమించారు.

తల్లికి మందులు తీసుకొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- కువైట్ నుంచి వారం క్రితమే రాక


సాలెహా (ఫైల్)

ఆత్మకూరు: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి మందులు తీసుకునేందుకు ఆత్మకూరుకు బైక్‌పై వచ్చి.. స్వగ్రామానికి తిరిగెళ్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన హృదయ విదారక ఘటన పట్టణ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మర్రిపాడు మండలం కదిరినేనిపల్లికి చెందిన సాలెహా (28) జీవనోపాధి నిమిత్తం కువైట్ వెళ్లి వారం క్రితం స్వగ్రామానికి వచ్చారు. తన తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో మందులను తీసుకునేందుకు గానూ పట్టణానికి బైక్‌పై వచ్చారు. రాత్రి 10.30 సమయంలో గ్రామానికి వెళ్తుండగా, ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఎదురుగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై ముత్యాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సాలెహా మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అదుపుతప్పిన బైక్

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు


పృథ్వీచంద్ర మృతదేహం

వలేటివారిపాళెం: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కందుకూరులోని కోటారెడ్డినగర్‌కి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మల్లారి పృథ్వి చంద్ర (27) తన స్నేహితుడు వెంకటభూపాలచౌదరితో కలిసి అత్తంటివారిపాళెంలో జరిగే పోలేరమ్మ తిరునాళ్లకు బయల్దేరారు. ఈ క్రమంలో హెరిటేజ్ డెయిరీ, ఐటీటీ కాలేజీ మధ్య ఉన్న మలుపు వద్దకొచ్చేసరికి మెరుపులతో వర్షం కురవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో రోడ్డు మార్జిన్ దిగారు. తిరిగి రోడ్డెక్కే సమయంలో అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరూ గాయపడ్డారు. ప్రమాదంలో పృథ్వి తలకు తీవ్రగాయం కావడంతో మృతి చెందారు. మృతుడి తండ్రి మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): నగరంలోని కరెంటాఫీస్ సెంటర్‌లో ఓ మూతపడిన దుకాణ షట్టర్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

నెల్లూరు(క్రైమ్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని గుండాల సుబ్బారెడ్డితోటకు చెందిన విజయకుమార్ (42), ఆముద దంపతులకు ముగ్గురు పిల్లలు. గిడ్డంగివీధిలో జ్యూస్ షాప్‌ను నిర్వహిస్తూ వచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషించుకోసారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన విజయ్‌కమార్ మద్యం సేవించి ఎక్కడపడితే అక్కడ పడిపోయేవారు. భార్య, పిల్లలు వెతుక్కుంటూ వెళ్లి ఆయన్ను ఇంటికి తీసుకొచ్చేవారు. అన్నం తినడాన్ని ఇటీవల మానేయడంతో ఆరోగ్యం క్షీణించింది. తాజాగా ఈ నెల 11న ఇంట్లో పూటుగా మద్యం సేవించి మంచంపై పడుకున్నారు. కొద్దిసేపటికి వాంతులవుతూ కిందపడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి వేలూరులోని సీఎమ్సీకి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పరిస్థితి చేయిదాటిందని చెప్పడంతో నెల్లూరు తీసుకొచ్చారు. జీజీహెచ్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మామను హతమార్చిన అల్లుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): మామను హత్య చేసిన అల్లుడ్ని చిన్నబజార్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం నవలాకులగార్డెన్స్‌కు చెందిన ఆసిఫ్ (53), సమీనా దంపతులు తమ పెద్ద కుమార్తెకు రంగనాయకులపేటలోని రైలువీధికి చెందిన కార్పెంటర్ షఫీతో వివాహం చేశారు. విభేదాల నేపథ్యంలో షఫీ భార్య పుట్టింట్లో మూడు నెలలుగా ఉంటున్నారు. కాపురానికి భార్యను పంపాలని షఫీ కోరగా, పెద్దలతో మాట్లాడతానని ఆసిఫ్ చెప్తూ వచ్చారు. దీంతో కక్ష పెంచుకున్న షఫీ.. మద్రాస్ బస్టాండ్ వద్ద పూలు అమ్ముకుంటున్న ఆసిఫ్‌ను ఆదివారం హత్య చేసి పరారయ్యారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టి, పుత్తా ఎస్టేట్స్ వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్): ఓ వ్యక్తిని తుపాకీతో కాల్చి హత్యాయత్నానికి పాల్పడ్డారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు వేముల రూప్‌కుమార్‌కు ఐదేళ్ల జైలుతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం సౌత్ ఆమలూరుకు చెందిన రంగినేని కిరణ్, ఆయన మామకు అదే గ్రామంలోని పాములదొరువు కండ్రిగలో పొలాలున్నాయి. ఈ క్రమంలో నెల్లూరులోని సరస్వతీనగర్‌కు చెందిన వేముల రూప్‌కుమార్, వేముల చలపతి, శిరీష్ తదితరులు పాములదొరువు కండ్రిగలోని నడక మార్గం వద్ద గేట్ పెట్టేందుకు 2015, ఏప్రిల్ ఒకటిన యత్నించారు. దీంతో కిరణ్, ఆయన మామ తదితరులు అక్కడికి చేరుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. డొంకలో గేట్‌ను ఏర్పాటు చేస్తే పొలంలోకి దారి ఉండదని చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ తరుణంలో నిందితుడు రూప్‌కుమార్ తన వద్ద ఉన్న తుపాకీతో కిరణ్‌ను కాల్చారు. పక్కకు తప్పుకోవడంతో భుజానికి బుల్లెట్ గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు కారులో పరారయ్యారు. గాయపడిన కిరణ్‌ను ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తోటపల్లిగూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం రూప్‌కుమార్, చలపతి, శిరీష్‌పై కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో రూప్‌కుమార్‌పై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధించారు. మిగిలిన ఇద్దరిపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసును కొట్టేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నారాయణమ్మ వాదించారు.

యజమానులకు గుర్తింపుకార్డులివ్వాలి


డ్రగ్ కంట్రోలర్ ఏడీకి మొక్కను అందజేస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని మెడికల్ షాపుల యజమానులకు గుర్తింపు కార్డులను అందజేయాలని జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ వీరకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వీరకుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కీర్తి పవిత్రను కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి మొక్కలను అందజేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు పేరూరి ప్రదీప్‌కుమార్ మాట్లాడారు. దుకాణదారులకు గుర్తింపు కార్డులను త్వరలోనే అందజేస్తామని చెప్పారు. జిల్లాలోని 2250 మెడికల్ షాపుల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించేలా చర్యలు చేపడతామని వివరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ నరేంద్రబాబు, అయితా భాస్కర్, అశోక్, సాయి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

పొదలకూరు : భార్యను వేధిస్తున్న భర్త, అత్తామామలపై కేసును పోలీసులు మంగళవారం నమోదు చేశారు. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు.. పట్టణంలోని ఎమ్మార్వో కాలనీకి చెందిన నిరోషాకు రామయ్యతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో రామయ్య తన తల్లిదండ్రులతో కలిసి భార్యను వేధింపులకు గురి చేయసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.